DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
శనివారం, నవంబరు 4, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## మట్టి మాఫియాపై తుమ్మల మండిపాటు



ఖమ్మం: ఖమ్మం నగరంలో అరాచకం రాజ్యమేలుతుందని ఇసుక నుండి మట్టి దాకా దోపిడి దొంగల పాలయ్యిందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. ఖమ్మం 50 డివిజన్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుతం సామాన్యుడు ఒక ప్లాటు కొనుక్కుంటే దాన్ని కూడా ఎపుడు ఎవరొచ్చి కబ్జా చేస్తారోనని బిక్కు బిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని,నగరంలో అన్ని మాఫ్ఫియాలతో పాటు కొత్తగా ట్రాన్స్ పార్ట్ మాఫియా కూడా వెలుగులోకి వచ్చిందని ఈ దుర్మార్గపు పాలన నుండి ఖమ్మం నగర ప్రజలు బయట పడాలంటే నవంబర్ ముప్పైన జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి కాంగ్రెస్ పార్టీనీ గెలిపించాలని తుమ్మల కోరారు.

# కమలంలో సీనియర్లు... తొడగొట్టారు... వెనక్కి తగ్గారు





హైదరాబాద్, నవంబర్ 4, (వాయిస్ టుడే): తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనంటూ ప్రతి వేదికపై ప్రచారం చేస్తూ హడావుడి చేసిన కమలదళం.. సరిగ్గా ఆ సమయం వచ్చేసరికి తటాపటాయిస్తోందనే చర్చ జరుగుతోంది. పైగా ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు అసెంబ్లీకి పోటీ చేయాల్సిందేనంటూ ఆరు నెలలుగా హైకమాండ్ ప్రెషర్ పెడుతున్నా.. సీనియర్లలో కదలికే లేదని టాక్. సీనియర్లంతా తాము పార్లమెంట్ ఎన్నికల్లోనే పోటీ చేస్తామని చెబుతూ అసెంబ్లీ బరి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని టాక్ వినిపిస్తుంది.బీజేపీ అభ్యర్థుల జాబితా ఎప్పుడెప్పుడు వస్తుందా అని కార్యకర్తలు తెగ ఎదురుచూశారు. మొత్తానికి 52 మందితో ఫస్ట్ లిస్ట్ విడుదల చేశారు. కానీ, ఆ లిస్టులో ఎక్కడా సీనియర్లు కనిపించలేదు. రాజాసింగ్, ఈటల రాజేందర్, రఘునందన్ మినహా. ఇక రెండో లిస్టులోనైనా సీనియర్లు ఉంటారనుకుంటే అందులోనూ కార్యకర్తలకు నిరాశే ఎదురైంది.గెలిచేది తామేనంటారు, కానీ పోటీ చేయరు. పోటీచేయాల్సిన వాళ్లు పార్టీలో ఉండరు, పార్టీలో ఉన్నవాళ్లు పోటీ చేయరు. ఈ రెండు స్టేట్‌మెంట్లు దాదాపు ఒకేలా ఉన్నా.. విడమరిచి చూస్తే ఒక్కో సెంటెన్స్‌లో చాలా అర్థం కనిపిస్తుంది. తెలంగాణలో అధికారం మాదే..! ఇప్పటికీ ఇదే మాట వినిపిస్తోంది భారతీయ జనతా పార్టీ నేతల నుంచి.. కానీ, ఆ డైలాగులు ఎవరైతే చెబుతున్నారో, గెలుస్తామని ధీమాగా చెబుతున్నారో.. వాళ్లే పోటీకి దూరంగా ఉన్నారు. స్వయాన పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తే.. అసెంబ్లీకి పోటీ చేయను, లోక్‌సభ ఎన్నికలే నా టార్గెట్ అంటుంటే.. ఇక కింది స్థాయి నేతల పరిస్థితేంటీ..? ఇదే ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా వినిపిస్తున్న ప్రశ్న.బీజేపీ గ్రాఫ్ పీక్స్‌లో ఉన్నప్పుడు.. సూపర్-30 మాదిరి ఫస్ట్ లిస్ట్ విడుదల చేస్తామన్నారు. ఆ జాబితాలో ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు, ఎంపీలుగా ఉన్న వాళ్లు, పబ్లిక్‌లో ఇమేజ్ ఉన్న వాళ్లు ఉంటారని చెప్పుకొచ్చారు పార్టీ ముఖ్యనేతలు. కిషన్‌రెడ్డితో సహా ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ఉన్నవాళ్లంతా పోటీ చేస్తారనే అనుకున్నారు. తీరా చూస్తే చాలామంది సీనియర్లు పోటీకి దూరంగా ఉన్నారు. పైగా డైరెక్ట్ స్టేట్‌మెంట్స్ కూడా ఇచ్చేస్తున్నారు. తాము ఈసారి అసెంబ్లీకి పోటీ చేయడం లేదంటున్నారు..ఓవైపు నామినేషన్లకు అందరూ సిద్ధం అవుతుంటే.. టికెట్ ఇస్తాం రండి అని అధిష్టానం పిలుస్తుంటే.. ఈ సమయంలో పోటీకి దూరం అని స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఏంటి? పార్టీ ముఖ్యులకు తెలుస్తోందో లేదో గానీ తెలంగాణ సమాజానికి మాత్రం ఇది రాంగ్ సిగ్నల్ పంపుతోంది. బండి సంజయ్, అరవింద్ ధర్మపురి, సోయం బాపూరావు వంటి వాళ్లు సైతం అయిష్టంగానే అసెంబ్లీ బరిలో దిగారనేది పార్టీలోని కొందరు చెబుతున్న మాట. ప్రస్తుతానికి నలుగురు ఎంపీల్లో ముగ్గురు అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. అయితే ఇక్కడే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, సీనియర్ లీడర్ విజయశాంతి.. వీళ్లందరూ ఎందుకు పోటీ చేయడం లేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ఇదంతా చూస్తుంటే బీజేపీ సీనియర్ల అభిమతం ఎలా ఉందో గానీ.. ఇటు క్యాడర్‌లో, అటు ప్రజల్లో ఇదే చర్చ జరుగుతోంది. పైగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోతే.. మళ్లీ వాళ్లనే పార్లమెంట్ బరిలో కూడా దింపుతారు. సో, రెండుసార్లు భారీగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పుడు పోటీ చేయకపోవడానికి ఈ భయం కూడా ఓ కారణం అన్న చర్చ మొదలైంది.గద్వాల జేజమ్మ డీకే అరుణ తాను పోటీ చేయడం లేదని తేల్చి చెప్పేశారు. బీజేపీలోని మరో సీనియర్ నేత జితేందర్ రెడ్డి సైతం పోటీకి దూరంగా ఉన్నారు. ఆయన బదులు తన కుమారుడికి బీఫామ్ ఇప్పించుకున్నారు. ఇక మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా లోక్‌సభకే పోటీ తప్పా.. అసెంబ్లీకి కాదంటున్నారు. ఎంపీ లక్ష్మణ్ తాను రాజ్యసభ సభ్యుడి అంటూ చెబుతున్నారు. మరో సీనియర్ లీడర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని గవర్నర్ స్థానంలో పంపించారు. ఇక మల్కాజిగిరి అసెంబ్లీ నుంచి పోటీచేస్తారని ప్రచారం జరిగిన రామచంద్రరావు.. వీళ్లంతా పోటీకి దూరంగానే ఉన్నారు.ఇలా అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉండడాన్ని బీజేపీ అధిష్టానం ఏమనుకుంటోందో గానీ.. క్యాడర్ మాత్రం ఓటమిని ముందే అంగీకరించినట్లేనని ఫీల్ అవుతోంది. పైగా రోజుకో సీనియర్ లీడర్ వెళ్లిపోతున్నా, ఉన్న సీనియర్లు పోటీ చేయబోమని చెప్పేస్తున్నా జాతీయ నాయకత్వం లైట్ తీసుకోడాన్ని కూడా కొందరు సహించలేకపోతున్నారు. ఇంతే స్తబ్దుగా ఉంటే మాత్రం.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి పార్టీ ఉనికి కోల్పోయిన ఆశ్చర్యం లేదనే అభిప్రాయాన్ని గట్టిగానే వినిపిస్తోంది.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి లాంటి వాళ్లు బీఆర్ఎస్‌ను ఓడించేది కాంగ్రెస్సేనంటూ వెళ్లిపోయారు. పార్టీలో చేరిన స్వామిగౌడ్, దాసోజు శ్రవణ్ లాంటి నేతలను నిలుపుకోలేకపోయారు. అంటే పోటీ చేస్తారనుకున్న వాళ్లు ఉండరు.. ఉన్నవాళ్లు పోటీ చేయరు. అటు హైకమాండ్ కూడా పోటీ చేయాల్సిందే అని గట్టిగా చెప్పదు. ఇలా అయితే ఇక బీజేపీకి మిగిలేదేంటి? బీజేపీలో మిగిలేదెవరు?

కిషన్ రెడ్డి, డీకే అరుణ, విశ్వేశ్వర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, విజయశాంతి, లక్ష్మణ్, రామచంద్రరావు.. వీళ్లని బరిలోకి దింపలేకపోవడం పార్టీకి కచ్చితంగా మైనస్ అవుతుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.మరోవైపు బీజేపీ అభ్యర్థుల జాబితా ఎప్పుడెప్పుడు వస్తుందా అని కార్యకర్తలు తెగ ఎదురుచూశారు. మొత్తానికి 52 మందితో ఫస్ట్ లిస్ట్ విడుదల చేశారు. కానీ, ఆ లిస్టులో ఎక్కడా సీనియర్లు కనిపించలేదు. రాజాసింగ్, ఈటల రాజేందర్, రఘునందన్ మినహా. ఇక రెండో లిస్టులోనైనా సీనియర్లు ఉంటారనుకుంటే అందులోనూ కార్యకర్తలకు నిరాశే ఎదురైంది.ఇదిలావుంటే భారతీయ జనతా పార్టీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలంటే లోక్‌సభ స్థానాల్లోనే గెలవాలి. అందుకే.. సీనియర్లను పక్కనపెడుతున్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీలో జరిగిన అంతర్గత మీటింగ్‌లోనూ.. పార్లమెంట్ ఎన్నికల్లోనే తాము పోటీ చేస్తామని సీనియర్లు చెప్పినందునే ఈ రెండు లిస్ట్‌లలో వాళ్ల పేర్లు లేవు అనే చర్చ జరుగుతోంది. ఫైనల్‌గా జనంలో వినిస్తున్న టాక్ ఒక్కటే. సీనియర్లు పోటీకి దూరంగా ఉండడం అంటే దేర్ ఈజ్ సమ్‌థింగ్.. సమ్‌థింగ్.. అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.



## దేశానికి దారి చూపుతున్న తెలంగాణ మోడల్

**నేతన్నలకు అండగా సీఎం కేసీఆర్**

**బతుకమ్మ చీరలను రాజకీయం చేసిన కాంగ్రెస్ కు మహిళలు కర్రుకాల్చి వాతపెడుతారు**

**సోలాపూర్‌లో వస్త్ర పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులతో సంభాషించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్: దేశానికి తెలంగాణ మోడల్ దారిచూపుతోందని, సీఎం కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనన్ని కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్రలో చేనేత కార్మికులు పడుతున్న బాధలు, కష్టాలు తీరాలంటే తెలంగాణ అభివృద్ధి నమూనానే ఏకైక పరిష్కారమని అభిప్రాయపడ్డారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఇటీవల సోలపూర్ కు వెళ్లిన కవిత అక్కడి వస్త్ర పరిశ్రమలను సందర్శించి వాటి నిర్వాహకులతో, కార్మికులతో సంభాషించారు. ఆ సంభాషణ సంబంధిత వీడియోను తన సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు..

మహారాష్ట్రలో వస్త్ర పరిశ్రమలతో. పాటు ఇతర పరిశ్రమలకు నీటి కొరత, విద్యత్తు కొరత చాలా తీవ్రంగా ఉందని, విద్యుత్తు చార్జీలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయని వారు కవిత దృష్టికి తీసుకొచ్చారు. మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేవని వారు చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం వస్త్ర, చేనేత పరిశ్రమదారులు, కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వారు ప్రశంసించారు.



## ఫాక్స్‌కాన్‌ను బెంగళూరుకు తరలించేందుకు కాంగ్రెస్ కుట్ర

### డీకే శివకుమార్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్ (వాయిస్ టుడే): రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఫాక్స్‌కాన్ కంపెనీని బెంగళూరుకు తరలించేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఫాక్స్‌కాన్ కంపెనీకి లేఖ రాయడంపై కేటీఆర్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ జలవిహార్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ న్యాయవాదుల సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఫాక్స్‌కాన్ కంపెనీ ఆపిల్ ఫోన్లకు సంబంధించిన అనేక పరికరాలు తయారు చేస్తోంది. చైనాలో 15 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించింది. మనం కష్టపడి నాలుగేండ్లు వెంబడి పడి తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఒప్పించుకున్నాం. వివిధ వేదికల్లో అమెరికా, చైనా తైవాన్‌లో కలిసిన తర్వాత 2022లో ఫాక్స్ కాన్ చైర్మన్ హైదరాబాద్‌కు వచ్చి సీఎం కేసీఆర్‌ను కలిసి ఫ్యాక్టరీ పెడుతాం అని ప్రకటించారు. ఒక లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదురుగా కొంగరకొలాన్‌లో 200 ఎకరాల స్థలంలో నిర్మాణం ప్రారంభించారు. రెండు అంతస్తులు పూర్తయ్యాయి. వచ్చే ఏప్రిల్, మే నెలలో ఫాక్స్ కాన్ కంపెనీ ప్రారంభం కానుంది అని కేటీఆర్ తెలిపారు.

అయితే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఫాక్స్‌కాన్ కంపెనీకి అక్టోబర్ 25న లేఖ రాశారు. ఆపిల్ ఎయిర్ పాడ్స్ ఇండస్ట్రీని హైదరాబాద్ నుంచి బెంగళూరుకు మార్చండి. తొందరల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతోంది. హైదరాబాద్ నుంచి పరిశ్రమలను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి బెంగళూరుకు తరలిస్తాం. ఇందుకు తెలంగాణలో ఉండే కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తుంది అని డీకే శివకుమార్ తన లేఖలో పేర్కొన్నట్లు కేటీఆర్ గుర్తు చేశారు.



## కోనాయిపల్లి ఆలయంలో సీఎం కేసీఆర్ పూజలు

**నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేయించిన సీఎం**

**ఈ నెల 9న గజ్వేల్, కామారెడ్డిలలో నామినేషన్ దాఖలు**

**ఆనవాయతీగా వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కేసీఆర్**

హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం సిద్దిపేట జిల్లా కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. ప్రతి ఎన్నికలకు ముందు కోనాయిపల్లిలో పూజలు నిర్వహించడం కేసీఆర్ ఆనవాయతీ. ఈ సారి కూడా దీనిని కొనసాగిస్తూ శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్నారు. ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి రోడ్డు మార్గంలో గుడికి చేరుకున్నారు. నామినేషన్ పత్రాలను స్వామి వారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మంత్రి హరీశ్ రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎం కేసీఆర్ ను ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి శేష వస్త్రాలతో పాటు, తీర్థ ప్రసాదాలను అందించారు. కాగా, ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ గజ్వేల్ తో పాటు కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 9న ఉదయం గజ్వేల్ లో, మధ్యాహ్నం కామారెడ్డిలో కేసీఆర్ నామినేషన్ దాఖలు చేస్తారని బీఆర్ఎస్ వర్గాల సమాచారం.



## నేపాల్‌లో భారీ భూకంపం.. 128 మంది మృతి

కఠ్మండూ: హిమాలయ దేశం నేపాల్‌లో భారీ భూకంపం వచ్చింది. శుక్రవారం అర్ధరాత్రివేళ 11.32 గంటలకు భూమి కంపించింది. దీని తీవ్రత 6.4గా నమోదయిందని నేషనల్ ఎర్త్‌క్వేక్ మెజర్‌మెంట్ సెంటర్ తెలిపింది. జాజర్‌కోట్ జిల్లాలోని లామిదండా ప్రాతంలో భూకంప కేంద్రం ఉన్నదని వెల్లడించింది. భూఅంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని పేర్కొంది. నెల రోజుల వ్యవధిలో నేపాల్‌లో భూకంపం రావడం ఇది మూడోసారి.

భూకంపం ధాటికి చాలా ఇండ్లు నేలమట్టమయ్యాయి. పలు ఇండ్లు ధ్వంసమయ్యాయి. ఇప్పటివరకు 128 మంది మరణించారని అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మృతుల్లో జాజర్‌కోట్ జిల్లాకు చెందినవారు 34 మంది ఉండగా, పశ్చిమ రుకుమ్ జిల్లాలో మరో 35 మంది ఉన్నారు. కాగా, మృతుల కుటుంబాలకు నేపాల్ ప్రధాని పుష్ప కమల్ సంతాపం తెలిపారు. దేశంలోని మూడు భద్రతా సంస్థలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయని, బాధితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. దైలేఖ్, సల్యాన్, రొల్పా జిల్లాల్లో కూడా పలువురు మృతిచెందారని, ఆస్తి నష్టం సంభవించిందని చెప్పారు. నేపాల్‌లో గత నెల 3న 6.3 తీవ్రతతో భారీ భూకంపం వచ్చింది. దీనివల్ల భారత్‌లోని ఢిల్లీ-రాజధాని ప్రాంతంలో కూడా కదలికలు సంభవించాయి. నేపాల్‌లో 2015లో 7.8 తీవ్రతతో వచ్చిన భూకంపం వల్ల 12 వేల మంది మరణించారు. పది లక్షలకుపైగా నిర్మాణాలు ధ్వంసమయ్యాయి.



## మా సేవలు.. అభివృద్ధి మీ కంటి ముందే కన్పిస్తాంది

**ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా బీఆర్ఎస్ పథకాలు**

**కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

మంథని (వాయిస్ టుడే): మా సేవలు..అభివృద్ధి మీ కంటి ముందే కనిపిస్తున్నాయని మమ్మల్ని ఆశీర్వదించి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా శనివారం మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేట, గొల్లగూడెంలలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐదేండ్లు ఏ పని చేయకుండా ప్రజలు సమస్యలు చెప్పుకుంటే మా ప్రభుత్వం లేదని చెప్పారని, అలాంటి వాళ్లు ఎన్నికల వస్తున్నాయని కమ్యూటినీ హాల్‌లకు నిధులు వెచ్చించడం మభ్యపెట్టడం కాదా అని అన్నారు. ప్రజలపై ప్రేమ ఉంటే ఏడాదికి కొన్ని నిదులు తీసుకువచ్చినా ఐదేండ్లలో ఎంతో అభివృద్ధి జరిగేది కాదా అని ఆయన అన్నారు. నోట్ల సంచులతో వచ్చి బీఆర్ఎస్ పార్టీ నాయకులను, ప్రజాప్రతినిదులను కొనుగోలు చేస్తున్నారని ఆయన వివరించారు. అనేక ఏండ్లు ఈ ప్రాంతంలో పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ పాలకులు ఏం చేశారని ప్రజలు ఆలోచన చేయాలని, ప్రజలు చైతన్యం చెందితేనే అభివృద్ధిని సాధించుకుంటామన్నారు. గతంలో బోయిన్‌పేట, గొల్లగూడెం ఎలాంటి స్థితిలో ఉండేదో ఈనాడు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంత మార్పు జరిగిందని ఆలోచించాలన్నారు. పనిచేసే నాయకులు ఎవరో ఓట్ల కోసం వచ్చే నాయకులు ఎవరో గమనించాలన్నారు. ఇన్నేండ్లలో మంథని నియోజకవర్గంలో ఒక బీసీ బిడ్డగా ఎదిగితే అణిచివేసే ప్రయత్నాలు చేస్తున్నారని, తనలాంటి వాళ్లను అడ్డు తప్పిస్తే ఇక తమకు ఎదురే ఉండదని బావించి కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రజలను దూరం చేయాలని చూస్తున్నారని ఆయన వాపోయారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా జెడ్పీ చైర్మన్‌గా తాను, సర్పంచ్‌గా మున్సిపల్ చైర్ పర్సన్‌గా తన బార్య ఎంతో అభివృద్ధి చేశామని, అనేక సేవలు చేశామని ఆయన గుర్తు చేశారు. మీరు ఇంటి నుంచి బయటకు వస్తే మా సేవలు, మేం చేసిన అభివృద్ధి కన్పిస్తుందన్నారు. కానీ కాంగ్రెసోళ్లు ఏం చేసిండ్లో ఏం చేస్తరో చెప్పే పరిస్థితిలో లేరన్నారు. మన గురించి మన ఆకలి కష్టాల గురించి పట్టించుకోనోళ్లు ఈనాడు మళ్లీ మనవద్దకు ఓట్ల కోసం వస్తున్నారని, అలాంటి వాళ్లకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

గ్యారెంటీ వారంటీ లేని పథకాలు కాంగ్రెస్‌వని, ఈనాడు పథకాల పేర్లు చెప్తున్న కాంగ్రెస్ నాయకులు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించాలన్నారు. సీఎం కేసీఆర్ గొప్ప పథకాలు అమలు చేస్తుంటే వాటిని మేం కూడా అమలు చేస్తున్నామని చెబుతున్నారని, పదేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రూ.200ల ఫించన్‌ను రూ.201 పెంచలేని చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం,సీఎం కేసీఆర్ గొప్పగా ఆలోచన చేసి ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తున్నారని, ప్రతి పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలను అమలు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రభుత్వ పథకాలతో పాటు తన సొంతంగా అనేక బృహత్తర సేవలు అందిస్తామని, మీ బిడ్డల భవిష్యత్‌బాధ్యత తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ నెల 7న మంథనిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రతి ఒక్కరు తరలిరావచ్చి విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్బంగా పిలుపునిచ్చారు



## మీ మొహంలో చిరునవ్వు కోసమే రాజకీయాల్లోకి వచ్చా

**ఢిల్లీ చేతులలో బానిసలం అవుదామా:పాడి కౌశిక్ రెడ్డి**

హుజురాబాద్ (వాయిస్ టుడే): ఆరు గ్యారెంటీలు పక్కన పెట్టండి...మీ పార్టీకే గ్యారెంటీ లేదు.. ప్రమాణం చేసి చెపుతున్నాను వావిలాల ని మండలం చేసి చూపిస్తా నేను రాజకీయాల్లోకి వచ్చిందే మీ మొహంలో చిరునవ్వు చూడడం కోసమని, ఒక్క అవకాశం ఇచ్చి నన్ను గెలిపిస్తే హుజురాబాద్ నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని హుజురాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జమ్మికుంట లోని నగరం, నగురం, వావిలాల,పాపక్కపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను ఘనంగా పెట్టి తెలంగాణ సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. సాధించిన తెలంగాణ ను ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి పదానికి నడిపించిన మహర్షి కేసీఆర్ అన్నారు. ఇక్కడ లేని విధంగా 24 గంటల కరెంటు తో పాటు 19 వేల కోట్లు రుణమాఫీ చేసి రైతుల మనసులలో చెరగని ముద్ర వేసుకున్నారు అన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలకు ఓటు వేసి గెలిపిస్తే తెలంగాణ పాలన ఢిల్లీ కి వెళ్తుందని, మరోసారి తెలంగాణ ప్రజలు ఢిల్లీ చేతుల్లో బానిసలు అవుతారని అన్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రం అంధకారంలోకి పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కొత్త మేనిఫెస్టో రూపొందించారని, మేనిఫెస్టోలో పేద ప్రజల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఇందులో ముఖ్యంగా కెసిఆర్ ధీమా ఇంటింటికీ భీమా అని తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబంలో ఎవరైనా పోషకులు మరణిస్తే ఆ కుటుంబానికి ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇవ్వనున్నామని అన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకంతో ప్రతి మహిళకు నెలకు 3000 రూపాయాలు అందజేయనున్నామని, దీంతోపాటు గ్యాస్ సిలిండర్ ని కూడా కేవలం 400 కే అందజేస్తామన్నారు. అంతేకాకుండా అన్నపూర్ణ పేరిట తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్న బియ్యం ఇస్తామన్నారు. ఆరోగ్యశ్రీని కూడా ఐదు లక్షల నుంచి 15 లక్షలకు పెంచుతామన్నారు. పెన్షన్ కూడా దఫలవారీగా 5000 వరకు పెంచుతామని, వికలాంగుల పెన్షన్ కూడా 4000 నుంచి 6000కు పెంచనున్నామన్నారు. బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు పెట్టుకున్న అందరికీ కూడా ఎలక్షన్ అనంతరం చెక్కులు పంపిణీ చేస్తామని అన్నారు.

# మేడిగడ్డపై సేఫ్టీ కమిటీ అనుమానాలు



వరంగల్, నవంబర్ 4, (వాయిస్ టుడే): మేడిగడ్డ ప్రాజెక్టుపై డ్యామ్ సేఫ్టీ అథారిటీ సంచలన నివేదిక వెలువరించింది. బ్యారేజీ ప్లానింగ్, డిజైన్ సరిగా లేవని, బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో దానిని పునాదుల నుండి తొలగించి తిరిగి పూర్తిగా నిర్మించాల్సిందేనని డ్యామ్‌సేఫ్టీ అథారిటీ నివేదిక పేర్కొంది.అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా ఇదే విధమైన సమస్యలను ఎదుర్కొనే అవకాశాలున్నాయని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. నిర్వాహణ లోపాలు, నిర్లక్ష్యం వల్ల బ్యారేజీ క్రమంగా బలహీనపడిందని, బ్యారేజీ వైఫల్యం ప్రజల జీవితాలకు, ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని నివేదికలో పేర్కొన్నారు.మేడిగడ్డలో ప్రస్తుతం తలెత్తిన సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు బ్యారేజీ మొత్తం ఉపయోగించే అవకాశం లేదని డ్యామ్ సేఫ్టీ అథారిటీ తేల్చేసింది.ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ మరియు ఆపరేషన్ మెయింటెనెన్స్ విషయాల్లో వైఫల్యం వల్లే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి కారణమని అభిప్రాయపడ్డారు.బ్యారేజీ పునాది కింద ఉన్న ఇసుక కొట్టుకుపోవడంతో పాటు ఫౌండేషన్ కోసం వినియోగించిన మెటీరియల్ పటిష్టతలో లోపాలు, వాటి సామర్థ్యం తక్కువగా ఉండటం, బ్యారేజీ ఎగువున లోడ్ వల్ల ఎగువన ఉన్న కాంక్రీట్ పైల్స్ బలహీనమై పిల్లర్స్ సపోర్ద్ బలహీనపడిందని అభిప్రాయపడ్డారు.మరోవైపు మేడిగడ్డ కుంగిపోవడంతో కేంద్ర జలసంఘం, కేంద్రం నియమించిన కమిటీ కోరిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని, 20 అంశాలపై వివరాలు అడిగితే కేవలం 12 అంశాల వివరాలను మాత్రమే ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన డేటా అసంపూర్ణంగా ఉందని నివేదికలో వివరించారు.2023 అక్టోబర్ 29, లోపు పూర్తి వివరాలను అందించకపోతే బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన పరీక్షలు, అధ్యయనాలను రాష్ట్ర ప్రభుత్వం చేయలేదని భావించాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా తెలిపింది.వర్షాకాలానికి ముందు , ఆ తర్వాత ఇన్స్ట్రక్షన్ రిపోర్టులు, కంప్లీషన్ రిపోర్టులు, క్వాలిటీ రిపోర్టులు, థర్డ్ మానిటరింగ్ రిపోర్టులు, భౌగోళిక సమాచారం, వర్షాకాలం ముందు తర్వాత నది కొలతలను చూపించే స్ట్రక్చరల్ డ్రాయింగ్‌లపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమాచారం అందించలేదు.ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని దాచిపెట్టినట్లయితే చట్టపరమైన చర్యలకు తీసుకునే అవకాశం తమకు ఉందని డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో పేర్కొంది. ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ ఆపరేషన్ మెయింటెనెన్స్ వైఫల్యం వల్లే మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోయాయని తేల్చింది. బ్యారేజ్ పునాది కింద ఉన్న ఇసుక కొట్టుకుపోయిందని, నిర్మాణానికి వాడిని మెటీరియల్ పటిష్టంగా లేదని వివరించారు.కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజ్ కీలకం కాగా.. అక్టోబర్ 21న పునాది కుంగిపోయి, పిల్లర్లు దెబ్బతిన్నాయి. దీంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నియమించిన కమిటీ అక్టోబర్ 23న మేడిగడ్డ బ్యారేజ్ ని పరిశీలించింది.బ్యారేజీ బ్లాక్ లలో సమస్య వల్ల మొత్తం బ్యారేజీని యథాతథంగా ఉపయోగించడానికి అవకాశం లేదని కమిటీ నివేదిక పేర్కొంది. ఈ దశలో రిజర్వాయర్ నింపితే బ్యారేజ్ మరింత కుంగుతుందని హెచ్చరించారు. మేడిగడ్డ తరహాలోనే అన్నారం, సుందిళ్ల నిర్మించారని భవిష్యత్తులో రెండు ప్రాజెక్టులలో ఇవే పరిస్థితిలో వచ్చే అవకాశం ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన అన్నారం, సందిళ్లను తనిఖీ చేయాలని కమిటీ సూచించింది.




**హైదరాబాద్ గాంధీ భవన్ లో గులాబీ కారు హల్ చల్ చేసింది. బై బై కెసీఆర్ అంటూ పోస్టర్లను దానికి అతికించి గాంధీ భవన్ ఎదుట ప్రదర్శనకు ఉంచారు. అహంకారంపై తిరగబడదాం, తెలంగాణను రూ. 3 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణ ప్రజలను ముంచిండు, మాకిచ్చే పథకాల్లో 30% కమిషన్లు మింగుతుంటివి అని రాసిన పోస్టర్లను అతికించారు. కెసిఆర్ సర్కార్ వైఫల్యాలు. అవినీతి పనులపై వివరించారు. కాంగ్రెస్ శ్రేణులు కారును పోటోలు తీసి షేర్ చేస్తున్నారు.**

## పేరు గొప్ప ఊరు దిబ్బ లెక్క దొరగారి కమీషన్ల కాళేశ్వరం దుస్థితి



హైదరాబాద్ (వాయిస్ టుడే): కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగడంపై వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. "పేరు గొప్ప ఊరు దిబ్బ లెక్కుంది దొరగారి కమీషన్ల కాళేశ్వరం దుస్థితి. నా రక్తం, నా చెమట అని కల్లబొల్లి మాటలు చెప్పి.. కట్టింది ప్రాజెక్ట్ కాదు పేక మేడ అని బయట పడ్డది. తెలంగాణ ప్రజల సంపద 1.27 లక్షల కోట్లు ఎందుకు ఖర్చు పెట్టినట్లు? ఏం ఉద్ధరించినట్లు? మేడిగడ్డ బ్యారేజ్ పై డ్యామ్? సేఫ్టీ అథారిటీ ఇచ్చిన రిపోర్టు. మీ మెగా అవినీతికి,మెగా పనితనానికి నిదర్శనం. వందల ఏళ్లు చెక్కు చెదరకుండా ఉండాల్సిన బ్యారేజ్‌లు.. కట్టిన నాలుగేళ్లకే ముక్కలైన ఘనత ప్రపంచలోనే మన మెగా కేసీఆర్ కే దక్కింది" అంటూ వైఎస్సార్టీపీ చీఫ్ ఎద్దేవా చేశారు. 80 వేల పుస్తకాలు చదివిన దొర మెగా ఇంజినీరింగ్ పనితనం ప్రపంచానికి తెలిసిందన్నారు. లోపాలు కళ్లముందు కొట్టొచ్చినట్లు కనపడుతుంటే.. దొర లక్ష కోట్ల దోపిడీ జనాలకు అర్థమైతుంటే.. బీటలు బారడం కామనట... నెర్రెలు రావడం సహజమట అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై వెంటనే ఒక దర్యాప్తు కమీషన్‌ను వేయాలని.. జరిగిన అవినీతిపై విచారణ తక్షణం చేపట్టాలని మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.



## పుప్పాల్‌గూడలో విషాదం.. ఇద్దరు యువకుల మృతి

నార్సింగీ (వాయిస్ టుడే): నగరంలోని పుప్పాల్‌గూడలో విషాదం నెలకొంది. ఓ నిర్మాణ సంస్థలో ఇద్దరు యువకులు మృతిచెందారు. రెడీమిక్స్ ప్లాంట్ మిక్సర్‌లో మృతదేహాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. రెడీ మిక్స్ మిక్సర్ క్లీనింగ్ చేస్తుండగా ఆపరేటర్ ఒక్కసారిగా మిషన్ ఆన్ చేశాడు. దీంతో ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు రెడీ మిక్స్ మిక్సర్‌లోపడి మృతిచెందినట్లు సమాచారం. యువకులు మృతిచెందడంలో విషయం తెలుసుకున్న బంధువులు వారు పనిచేసే ప్రాంతానికి వచ్చి వాగ్వాదానికి దిగారు. అక్కడ ఉన్న ఫర్నీచర్ ధ్వంసం చేసి అద్దాలు పగలగొట్టారు. నార్సింగీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## అంబాసిడర్ కారులో వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన స్పీకర్ పోచారం



బాన్సువాడ (వాయిస్ టుడే): బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ ఎన్నికల గుర్తు అయిన అంబాసిడర్ కారులో బాన్సువాడలోని రిటర్నింగ్ ఆఫీస్‌కు చేరుకున్న ఆయన తన తొలి సెట్ నామినేషన్‌ను సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తాను నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నాని చెప్పారు. అందుకే 1994 నుంచి ఒక్కసారి మినహా ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించానన్నారు. ప్రజల అభిమానం వల్లే ఇది సాధ్యమయిందని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన 7 గంటల కరెంట్ హామీని కూడా నెరవేర్చడం లేదని విమర్శించారు. మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణమని చెప్పారని.. తీరా గెలిచిన తర్వాత బస్సులను బంద్ చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిపెస్టో అద్భుతంగా ఉందని చెప్పారు. బీఆర్ఎస్ ఆమోద యోగ్యమైన, అమలు చేయదగిన మ్యానిఫెస్టో అన్నారు. బీఆర్ఎస్‌కు చాలా స్థానాల్లో పోటీయే లేదని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. తాము మూడోసారి అధికారంలోకి రావడం.. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవడం ఖాయమన్నారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు 119 నియోజకవర్గాల్లో 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది. నవంబర్ 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ ఉంటాయని నోటిఫికేషన్‌లో ఎన్నికల సంఘం తెలిపింది.

## మైనంపల్లి నన్ను చంపుతానని బెదిరిస్తున్నాడు



హైదరాబాద్ (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని మంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ..." తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పుడే కాంగ్రెస్ పార్టీ పని అయింది. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక పరిశ్రమలు మూతపడ్డాయి. రేవంత్‌రెడ్డిని మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపిస్తే ఇక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. మైనంపల్లి హన్మంతరావు ఓ రౌడీ. మైనంపల్లి ఈ ఎన్నికల్లో గెలిచేది లేదు. బీఆర్ఎస్ పార్టీ నుంచి మైనంపల్లి హన్మంతరావుని గెంటేస్తే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాక పిచ్చోడు అయ్యాడు" అని మల్లారెడ్డి సెటైర్లు వేశారు.

## బీఆర్ఎస్ ఇతర రాష్ట్రాల్లో ఎందుకు పోటీ చేయడం లేదు?



కరీంనగర్ (వాయిస్ టుడే): బీఆర్ఎస్ ఇతర రాష్ట్రాల్లో ఎందుకు పోటీ చేయడం లేదని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు ప్రశ్నించారు. ఏపీ, మహా రాష్ట్రల్లో పోటీ చేస్తారా.. లేదంటే వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల పోటీ చేయకపోతే విమర్శిస్తారా? అని నిలదీశారు. షర్మిల చాలా క్లారిటీగా ఉన్నారన్నారు. షర్మిల పోటీ చేయకపోవడమే మంచిదన్నారు. మిగతా రాష్ట్రాల్లో బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయలేదని హరీష్ రావు చెప్పాలని గోనె ప్రకాశరావు ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ కూడా కొన్నిసార్లు పోటీ పెట్టలేదన్నారు. తెలంగాణ ను విమర్శించిన టీడీపీ, సీపీఎంతో కేసీఆర్ పొత్తు పెట్టుకోలేదా? అని ప్రశ్నించారు. షర్మిలను విమర్శించడం హరీష్ రావుకు తగదని గోనె ప్రకాశరావు పేర్కొన్నారు.